మీద నాకు ఉన్న యిష్టాన్ని నువ్వే పోగొట్టవయ్యా అరుణాచలేశ్వరా అంటున్నారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-12-2016, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు అరుణాచల దీపోత్సవం. ఆచార్యులవారు దేశపర్యటన చేసినప్పుడు అరుణాచలం వచ్చి గౌతమఆశ్రమంలో కొన్ని రోజులు ఉన్నారు. అరుణాచలం అనే పేరు సంస్కృతనామము. అది స్కాంధపురాణంలో, శివపురాణంలో ఉన్న పేరు. అణ్ణామలై అనేది తమిళపేరు. అణ్ణామలై అంటే అందని కొండ. అరుణ అంటే ఎర్రటి, అచలం అంటే కదలిక లేనిది. అరుణాచలం అంటే ఎర్రటికొండ. ఆచార్యులవారు ఏమని చెప్పారంటే పార్వతీదేవి కంచిలో తపస్సు చేసింది. అరుణాచలం వచ్చి అరుణ అంటే పార్వతి, అచలం అంటే చలనం లేని ఈ కొండలో ఇక్కడ ఐక్యమయ్యింది. అంటే పార్వతీదేవి పరమేశ్వరుడిలో ఐక్యమయిన ప్రదేశం ఈ కొండ. అంటే ఒక్క శివుడే కాదు, పార్వతీ ఇద్దరూ కలిసి ఉన్న కొండ. అందుచేత దీనికి అరుణాచలం అని పేరు వచ్చింది అని ఆచార్యులవారు చెప్పారు. మనం గిరిప్రదక్షిణ చేసేటప్పుడు అరుణాచలేశ్వరుని గుడినుండి ఆడిఅణ్ణామలై వరకు శివుని భాగం, మరల ఆడిఅణ్ణామలై నుండి అరుణాచలేశ్వరుని గుడి వరకూ పార్వతి భాగం. అంటే కొండను తిరిగి వచ్చేటప్పటికి పార్వతీ పరమేశ్వరులిద్దరికీ ప్రదక్షిణ చేసినట్లు అవుతుంది. మీరు ఎప్పుడూ అయ్య గురించే చెపుతారు, కాని అమ్మ గురించి చెప్పరు ఏమిటని ఒకసారి భగవాన్‌ను అడిగారు. భగవాన్ ఏమన్నారంటే వాళ్ళిద్దరూ వేరు కాదు. మన కంటికి అలా వేరుగా ఉన్నట్లు కనిపిస్తున్నారు కాని ఇద్దరూ ఒక్కటే, అక్కడ సెపరేట్‌నెస్ ఏమీ లేదు. నేను శివుడి గురించి చెప్పే ప్రతీ మాటా పార్వతీదేవికి వర్తిస్తుంది. నేను పార్వతీదేవి గురించి ఏదయినా చెపితే అది శివుడికి కూడా వర్తిస్తుంది. నిప్పులోనుండి వేడిని విడదీయగలమా? అలాగే ఈశ్వరుడి నుండి అమ్మవారిని విడదీయలేము అని చెప్పారు. అరుణాచలం గురించి ఎక్కువ తెలుసుకోవాలి అంటే స్కాంధపురాణం, శివపురాణం చదవండి.

భగవాన్ మాటలు అవగాహన కావటానికి కొంచెం బుద్ధి సూక్ష్మత అవసరం. హిందూమతంలో ఎక్కువగా పూజలకు, యజ్ఞాలకు, యాగాలకు అలవాటు పడిపోయారు. సబ్జెక్టు శ్రవణం చేయటం తగ్గిపోయింది. సబ్జెక్టు శ్రవణం చేసే కొలదీ బుద్ధిసూక్ష్మత పెరుగుతుంది. ఆలోచించుకోవటానికే భగవంతుడు మనకు బుద్ధిని ఇచ్చాడు. మనం ఏదయినా ఒక మాట మాట్లాడితే, ఏదైనా ఒక పని చేస్తే దాని పరిణామం ఎలా ఉంటుంది అని మనం ఆలోచించుకోవాలి. అక్షరమణమాల అంటే మనం పెళ్ళికి పుష్పాలతో

మాలను తయారు చేస్తాము. ఇక్కడ భగవాన్ ఏమి చేసారంటే అరుణాచలేశ్వరుడనే పెళ్ళికుమారుడికి దండ వేయటానికి పుష్పాలతో కాకుండా అక్షరాలతో దండను తయారు చేసారు. ఇక్కడ పెళ్ళికూతురు భగవాన్, అరుణాచలేశ్వరుడు పెళ్ళికుమారుడు. భగవాన్ ఏమంటున్నారంటే అక్షరాలతో తయారుచేసిన దండను నీ మెడలో వేస్తున్నాను ఓ అరుణాచలేశ్వరుడా నీ అనుగ్రహం అనే దండను నా మెడలో వెయ్యి అంటున్నారు. ఈశ్వరానుగ్రహం ఉంటే మనకు అంతా ఉన్నట్లే. నీ చేతిలో డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంత తేలికో, ఈశ్వరానుగ్రహం ఉంటే నీకు మోక్షం రావటం కూడా అంత తేలిక. అనుగ్రహం చాలా ముఖ్యం. మాణిక్యవాచకర్ లాంటి గొప్పవాళ్ళు వ్రాసిన కవిత్వాలు రుచి చూసిన నీకు నా పద్యాలు నచ్చకపోవచ్చు. పాలు తాగిన తరువాత నీళ్ళు తాగితే ఎలా ఉంటుందో నా కవిత్వం నీకు అలా ఉండవచ్చు. అయినా నేను భక్తితో వ్రాసాను వీటిని స్వీకరించి నన్ను అనుగ్రహించు. గిరిప్రదక్షణ చేస్తే మీ కోరికలు నెరవేరతాయి అని పురాణాలలో వ్రాసారు. అదికాదు. అసలు ఏమీ కోరికలు లేకుండా, తలంపులు లేకుండా, పిచ్చాపాటీ మాటలు ఏమీ లేకుండా మీరు మౌనంగాను ప్రశాంతంగాను కనుక గిరిప్రదక్షణ చేస్తే ఈశ్వరుడు మీకు అన్నీ ఇచ్చి, తన స్వరూపాన్ని కూడా మీకు యిస్తాడు. అంత లాభం ఉంది. కాని మీరు కోరికలు కోరుకోవటం మానరుకదా. మీరు కోరికలు కోరుకోవటం వలన ఈశరుని అనుగ్రహం ఆ కోరికలకే పరిమితమైపోతుంది. భగవాన్ చాలాకాలం గిరి ప్రదక్షణ చేసేవారు. భగవాన్‌కు ఈ ప్రపంచంలో దేనిమీద అయినా ఇష్టం ఉంది అంటే ఆ కొండంటేనే ఆయనకు ఇష్టం. భగవాన్ దగ్గర భక్తులు లేనప్పుడు ఆయన ఎక్కువగా ఆ కొండవంకే చూస్తూఉండేవారు. మీరు ఆ కొండను తదేకంగా చూస్తున్నారు ఏమిటి అని భగవాన్‌ను అడిగితే నేను కొండను చూస్తున్నాను అని ఆయన చెప్పలేదు, నన్ను నేనే చూసుకొంటున్నాను అనేవారు భగవాన్. అంటే ఆయనకు భేదం లేదు. భేదం ఉంటే భయం వస్తుంది అభేదస్థితిలో భయంలేదు. భగవాన్ అక్షరమణమాలను ఆశ్రమంలో కూర్చొని వ్రాయలేదు. గిరిప్రదక్షిణ చేసేటప్పుడు, అప్పుడప్పుడు కొన్ని కొన్ని వ్రాసి అలా 108 పూర్తి చేసారు. అక్షరమణమాలలో భక్తి ఉంది, యోగం ఉంది, జ్ఞానం ఉంది. అన్నీ సమన్వయం చేసి వ్రాసారు. మాకు ఇంటిదగ్గరే బాగుంది. అరుణాచలం వచ్చిన తరువాత బాగా లేదు అని కొంతమంది అంటారు. అరుణాచలంలో ఏమి చేస్తాడు అంటే ఈశ్వరుడు నీ హృదయాన్ని కెలుకుతాడు. మీరు చెఱువులో బెడ్డ వెయ్యండి, లోపల ఉన్న బురద అంతా బయటకు వస్తుంది. అలాగే ఈశ్వరుడు నీ హృదయాన్ని కెలికినప్పుడు అందులో ఉన్న వాసనలు తలంపు రూపంలో నీ మెదడులోనికి వస్తాయి. అప్పుడు మీకు అశాంతి వస్తుంది. అలా ఎందుకు

చేస్తాడు అంటే మీ హృదయంలో ఏ వాసన అయితే ఉందో అది తలంపురూపంలో మీ మెదడులోకి రాకపోతే ఆ వాసన ఉందని కూడా మీకు తెలియదు. వాసన ఉందని మీకు తెలిస్తే దానిలోనుండి విడుదలఅవ్వటానికి మీరు ప్రయత్నం చేస్తారు. బుద్ధుడు వాసనాక్షయానికి ఎక్కువ విలువ యిచ్చాడు. కరెంట్ ఎక్స్‌ప్రెస్ అవ్వటానికి బల్బు ఎలా అవసరమో అలాగే నీ లోపల ఉన్న వాసన తలంపు రూపంతో ఎక్స్‌ప్రెస్ అవ్వటానికి మేటర్ అవసరం. మేటర్ లేకుండా తలంపు ఎక్స్‌ప్రెస్ అవ్వదు. నీకు తలంపులు లేనప్పుడు అంటే వాసనాక్షయం అయినప్పుడు ఇంక నీకు శరీరం అవసరం లేదు. నీకు లోపల ఒక్క వాసనా లేదు అనుకో, ప్రపంచంలో దేనిని ఎంజాయ్ చేయలనే బుద్ధి నీకు లేదు అనుకో. ఇంక శరీరాన్ని ఏమి చేసుకొంటావు. ఇంక అప్పుడు నీకు శరీరం అవసరం లేదు. అందుచేత నీకు పునర్జన్మ లేదు. బుద్ధుడి సిద్ధాంతం అది. జ్ఞాని పనిచేసి సంపాదించేదీ ఏమీ లేదు అంటే జ్ఞాని పని చేయటం వల్ల వచ్చే లాభంలేదు, పనిచేయకపోవటం వల్ల వచ్చే నష్టం లేదు. ఎందుచేతనంటే అక్కడ పెర్సనల్ ఐ లేదు. బలహీనులు, బద్ధకస్తులు, పిరికివాళ్ళు భౌతికమైనవే ఏమీ సాధించలేరు. ఇంక వాళ్ళకు మోక్షం ఏమిటి? బుద్ధుడు చెప్పిన వాసనాక్షయం గురించి భగవాన్ అక్షరమణమాలలో ఒక ద్విపదలో చెప్పారు. భౌతికమైన ఈ శరీరం స్మశానంలో కాలి బూడిద అవ్వకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి నాలో ఉన్న పునర్జన్మ కారణాలను దహనం చేసి నాకు బ్రాహ్మీస్థితిని ప్రసాదించు అరుణాచలా అని అక్షరమణమాలలో భగవాన్ చెప్పారు. మీరు జీవితంలో రకరకాల విషయాలు సాధించవచ్చు. సత్యజ్ఞానం అంటే ఏ జ్ఞానం అయితే సత్యమో, ఏజ్ఞానం అయితే అలౌకికమయినదో, ఏ జ్ఞానం సంపాదించటం వలన నువ్వు సుఖి అవుతావో, ఏ జ్ఞానం సంపాదించటం వలన నువ్వు సంసారచక్రంలో నుండి విడుదల పొందుతావో అట్టి జ్ఞానాన్ని సంపాదించకుండా నువ్వు శరీరాన్ని విడిచిపెట్టేస్తే ఇంక నువ్వు సాధించింది ఏమిటి, నువ్వు పొందేది ఏమిటి? మనం పదవులు సంపాదించవచ్చు, ధనం సంపాదించవచ్చు, అధికారం సంపాదించవచ్చు. కాని నువ్వు సత్యజ్ఞానం కనుక సంపాదించకపోతే, నువ్వు ప్రపంచంలో ఏది సాధించినా అవి అన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. నువ్వు నమ్మినా అంతే, నమ్మకపోయినా అంతే. అయితే మిమ్మల్ని నమ్మమని బలవంతం చేయరు. సబ్జెక్టు ఎదురుగా పెడతారు. మీరు తీసుకొంటే తీసుకోవటం, ఊసేసుకొంటే ఊసేసుకోవటం. మీ దగ్గరనుండి ఆశించటం ఏమీ ఉండదు.

ఏకవస్తువును చింతించటం వలన మనస్సు నశిస్తుంది. మీరాభాయి కృష్ణుడి

రూపాన్ని ధ్యానం చేసి మనోనాశనం పొందింది. మీరాభాయికి చిన్నతనంలోనే పెళ్లయింది. మీరాభాయిని పెళ్లికూతురిని చేసి సవారీలో కూర్చోబెట్టారు. సవ్వారిలో బట్టలు, బంగారం అవి పెట్టారు. మీరాభాయి చిన్నప్పటి నుండి కృష్ణుడి విగ్రహాన్ని పూజించేది. నేను రోజూ పూజించే కృష్ణుడి విగ్రహాన్ని వదిలేసి ఇవన్నీ సవ్వారీలో పెడుతున్నారు ఐ వాంట్ నైదర్ ఆర్నమెంట్స్ నార్ గార్మెంట్స్, ఐ వాంట్ మై లార్డ్ కృష్ణ. ఇవన్నీ ఎవడికి కావాలి. నేను పూజించే కృష్ణుడి విగ్రహాన్ని తీసుకొని వచ్చి ఇక్కడ పెట్టేయండి అని చెప్పింది. మీరాభాయి ఒకసారి బృందావనంలో ఉన్న ఒక ఆశ్రమానికి వచ్చింది. అక్కడ ఉన్న సేవకుడితో నేను మీ స్వాములవారిని చూడాలి లోపలకు వెళ్లి చెప్పండి అని చెప్పింది. ఆ సేవకుడు లోపలకు వెళ్లి పీఠాధిపతితో మీరాభాయి మిమ్మల్ని చూడటానికి వచ్చింది అని చెప్పాడు. మేము ఆడవాళ్లను చూడము అని చెప్ప అని పీఠాధిపతి చెప్పాడు. ఆ సేవకుడు తిరిగివచ్చి మా గురువుగారు ఆడవాళ్లను చూడరట అని మీరాభాయితో చెప్పాడు. ఆడవాళ్లను చూడను అనటానికి అసలు వీడు ఎవడు? మీ పీఠాధిపతి మగవాడా? మీరాభాయి జ్ఞానవైభవం చూడండి. నేను ఆడవాళ్లను చూడను అనటానికి వాడు పురుషుడా, వాడు స్త్రీయే కదా. ఇంతమంది పురుషులు లేరు. కృష్ణుడు ఒక్కడే పురుషుడు. మిగతావాళ్లు అందరూ ఆడవారే. అంటే దానిఅర్థం ఏమిటంటే దేహాభిమానం ఉన్నవారు అందరూ స్త్రీలే. నీకు బ్రహ్మజ్ఞానం కలిగితే నువ్వు పురుషుడవు లేకపోతే నువ్వు స్త్రీయే. నేను ఆడవాళ్లను చూడను అంటున్నాడు అంటే వీడికి స్త్రీ, పురుష బేధం ఉందికదా. స్త్రీ, పురుషబేధం ఉంది అంటే దేహబుద్ధి ఉన్నట్లే కదా. ఇంక వీడు పురుషుడు ఎలా అవుతాడు. బ్రహ్మంకు స్త్రీ, పురుషబేధం లేదు. బ్రహ్మంను తెలుసుకొన్నవాడు ఒక్కడే పురుషుడు. అందుచేత మీ గురువుగారికి చెప్ప వాడూ ఆడదే అని, వాడు పురుషుడు కాదు. వాడు ఎర్రబట్టలు వేసుకొన్నాడు కాని ఇంతవరకు ఈ సబ్జెక్టు వాడికి అర్థం అవ్వలేదు. అప్పుడు గురువు గారు నాదే తప్ప అని తెలుసుకొని, గొప్ప జ్ఞాని వచ్చింది మనం మిస్ అయిపోతున్నాము అనుకొని వెంటనే బయటకు వచ్చేసాడు. పళనిస్వామి భగవాన్‌కు చాలాసేవలు చేసాడు. ఆయన వైరాగ్యపురుషుడే కాని అంత వైరాగ్యం ఉన్నవాడికి చనిపోయే ముందు మామిడిపండు తినాలనిపించింది. అప్పుడు ఆయన జ్వరంతో ఉన్నాడు. మామిడిపండు తింటే జ్వరం పెరిగిపోతుంది. అందుచేత వాడు మామిడిపండు తినటం భగవాన్‌కు ఇష్టంలేదు. వాడు తినకుండా భగవానే ఆ మామిడి పండును తినేసారు. అంత వైరాగ్యం ఉన్నవాడికి చివరలో మామిడిపండు తినాలనే కోరిక రావటం ఏమిటి? అదేమాయ. అందుచేత భగవంతుడు గీతలో ఏమని చెప్పాడు అంటే నా దయ లేకుండా మాయను ఎవరూ జయించలేరు, మాయ మీకు దారి ఇవ్వదు

అని చెప్పాడు.

మనం బాగుపడాలి, సాధన చెయ్యాలి అనే బుద్ధి కూడా ఈశ్వరానుగ్రహం లేకుండా మనకు రాదు. సత్కర్మ చేయటం వలన భగవంతుడు అటువంటి బుద్ధిని ప్రేరేపిస్తాడు. జ్ఞాని పరిపూర్ణుడు, ఆయన సముద్రుడు. జ్ఞాని ఎలా ఉంటాడు అంటే మనకు జ్ఞానం కలిగితే అప్పుడు ఆయన స్థితి మనకు తెలుస్తుంది కాని లేకపోతే సాధ్యంకాదు. మన లిటిల్‌మైండ్స్‌కు అది అర్థంకాదు. మనం వారితో సహవాసం చేసినా వాళ్ళు ఎక్కడ ఉన్నారో మనకు తెలియదు. శారీరకంగా దగ్గరగా కూర్చోవచ్చు కాని లోపలకు వెళ్ళి చూస్తే వాళ్లు ఎక్కడ ఉన్నారో, నువ్వు ఎక్కడ ఉన్నావో? గీతలో పరమాత్మ ఏమని చెప్పాడంటే ఎవరికైతే నేను స్వరూపజ్ఞానాన్ని ఇవ్వాలి అనుకొన్నానో వారికి జ్ఞానాన్ని సంపాదించుకోవాలి అనే బుద్ధిని నేను ప్రసాదిస్తాను అని చెప్పాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే మీకు రోజులు బాగా వెళుతున్నా అదీ స్వప్నమే, రోజులు ఇబ్బందిగా వెళుతున్నా అదీ స్వప్నమే. రెండూ నిజం కాదు. మీకు ఒక ఎకరం పొలం ఎలా ఉందో అలాగే మీకు ఒక దేహం ఉంది. మనం దేహం కాదు, కర్మానుభవం కోసం దేహబుద్ధిని పెట్టాడు. ఆ దేహబుద్ధే మాయ. దేహబుద్ధిని పోగొట్టుకొన్నావు అనుకో అప్పుడు నువ్వు ఈ సృష్టిని దాటేస్తావు, అప్పుడు ఈశ్వరుడు నిన్నేమీ చేయలేడు. ఆవుదూడ తాడు తెంపుకొని పారిపోయింది అనుకో. ఇంక దానిని కొట్టడానికి అది మీ చేతికి దొరకదు. అలాగే మీరు జీవలక్షణాలు పోగొట్టుకొని దేహబుద్ధిని పోగొట్టుకొని మీరు వెళ్ళిపోతే ఇంక ఈశ్వరుడు మిమ్మల్ని ఏమీ చేయలేడు,.. వాడిచేతికి మీరు అందరు. నువ్వు ఏదయితే కాదో అదే నేను అనే బుద్ధిని నీకు పెట్టాడు. అక్కడే వచ్చింది గొడవ అంతా. ఆ బుద్ధిలోనుండి నిన్ను విడదీయటానికే ఆచార్యులవారు ప్రయత్నం చేసారు. ఆర్యాంబకు చనిపోయే టైము దగ్గరపడింది, ఆవిడ మంచం మీద పడుకొని ఉంది. అప్పుడు శంకరుడు వచ్చి అమ్మా నేను వచ్చేసాను అన్నాడు. ఆర్యాంబ అలా చూస్తోంది. అప్పటికి శంకరుడిని చూసి చాలా కాలం అయింది. ఆయనను గుర్తు పట్టలేకపోతోంది. నేను నీ కుమారుడిని శంకరుడిని అంటే శంకర అన్న పేరు వింటోంది. అది ఆవిడ బ్రెయిన్‌లో ఉండిపోయింది. ఆ నువ్వు శంకరుడివా అని అప్పుడు గుర్తుపట్టింది. ఆవిడ చాలా అశాంతిగా ఉంది. ఆవిడకు నిర్వాణస్థితి ఇవ్వాలి. ఆ స్థితిని అందుకోవటానికి ఆవిడ మనస్సు అనుకూలంగా లేదు. ఆచార్యుడు బ్రాహ్మీస్థితి గురించి చెప్పటం మొదలు పెట్టాడు. ఈ సబ్జక్టు నేను ఎప్పడూ వినలేదు, బ్రహ్మం అంటే ఏమిటి? నువ్వు చెప్పేది నాకు అర్థం కావటంలేదు, ఈ గొడవ వదిలెయ్యి అంది ఆర్యాంబ. ఆవిడకు కృష్ణుడు అంటే ఇష్టం. వాళ్ళ

పూర్వీకులు అందరూ కృష్ణుడిని ఆరాధించారు. నాకు కృష్ణుడిని చూపించు అంది. శంకరుడు అప్పుడు కృష్ణుడిని ప్రార్థించి, కృష్ణుడి రూపాన్ని ఆర్యాంబకు చూపించాడు. ఆర్యాంబ ఆ రూపాన్ని ఎంజాయ్ చేసింది. అప్పుడు మనస్సులో ఉన్న అశాంతి పోయింది. మనస్సుకు చాపల్యం పోయింది. కృష్ణుడి రూపం చూసాక ఆవిడకు మనోనిగ్రహం వచ్చింది. అప్పుడు టైము చూసి కృష్ణుడిమీద ఉన్న ఆవిడ మనస్సును హృదయగుహలోనికి విత్‌డ్రా చేసాడు శంకరుడు. అప్పుడు అల్టిమేట్ స్టేట్‌ను పొందింది.

జ్ఞానియొక్క ప్రభావం భక్తుని హృదయంలోనికి మౌనంగా ప్రవేశిస్తుంది. జ్ఞాని ఏది చేసినా సైలెంట్‌గానే చేస్తాడు. నీకు చేసే సహాయం నీ ప్రక్కన కూర్చొన్నవాడికి కూడా తెలియనివ్వడు. మీరు ఏదైనా మంచి పని చేస్తే అది అందరికీ తెలియాలి అనుకొంటారు. మహర్షులతోటి, మహాత్ములతోటి, యోగులతోటి నువ్వు సాంగత్యం చేయటం వలన నీకు వచ్చే లాభం ఏమిటి అంటే నీ హృదయంలో ఉన్న నిజం నీకు తెలుస్తుంది. అప్పుడు నీకు ఫ్రీడమ్ వస్తుంది. అంటే సత్యం అనేది నీ హృదయంలో ఉంది కాని అది నీకు తెలియదు. మహాత్ములతో సాంగత్యం వలన అది నీకు తెలియబడుతుంది. వారితో సాంగత్యం మంచిది. వారు చేసే పని నిర్మలంగా చేస్తారు, సైలెంట్‌గా చేస్తారు. ఆ సైలెన్స్ నీ మాటకు అందదు. పంచదార ఎలా ఉంటుంది అంటే తియ్యగా ఉంటుంది అంటారు. తీపిదనం ఎలా ఉంటుంది అంటే ఇంక మీరు చెప్పలేరు. మహాత్ముల గురించి కూడా అంతే. శరీరాలు ఎక్కడ ఉన్నా మీకు ఒక మహాత్ముడితోటి, మహర్షితోటి, జ్ఞానితోటి మానసిక అనుబంధం మంచిది. అరుణాచలం ఉంది, మీరు ఆ గిరిని మనస్సులో స్మరించినా సరిపోతుంది. మనస్సే కదా బాగుపడవలసింది. గోలక్ష్మి భగవాన్‌తో చాలా చనువుగా ఉండేది. భగవాన్ పేపరు చదువుతూ ఉంటే ఆ పేపరును ముట్టితో లాగేది. అప్పుడు భగవాన్ తలను ఆవు తలకాయమీద పెట్టేవారు. అలా పదినిమిషాలు ఉన్నాక వెళ్ళిపోయేది. ఈలోపుగా అక్కడ ఎవరైనా ఉన్నా పట్టించుకొనేది కాదు. అంటే లోపల మానసిక అనుబంధం. గోలక్ష్మి ఆశ్రమానికి చాలా సేవ చేసింది. ఆశ్రమానికి అప్పుడు డబ్బు కరువు. గోలక్ష్మి వచ్చాక డబ్బు వచ్చేసింది. గోలక్ష్మి చివరి రోజులలో శరీరాన్ని విడిచిపెట్టేటప్పుడు దానికి లిబరేషన్ ఇవ్వటం కోసం ఆవు తలను ఆయన ఒడిలో పెట్టుకొన్నారు. దానికి మోక్షం ఇవ్వటానికి ప్రయత్నం చేసాను కాని నా సహాయం అక్కరలేకుండా లక్ష్మి మోక్షాన్ని పొందింది అని భగవాన్ చెప్పారు. 100% ప్యూరిఫైడ్ సోల్. శరీరం ఆవు శరీరమే. లాస్ట్ మినిట్‌లో ఏదైనా బలహీనత ఉంటే తీసేద్దామని చూసాను. ఒక్క బలహీనత కూడా కనబడలేదు. లక్ష్మీస్ డిటాచ్‌మెంట్ ఈజ్